సాక్షి నంద్యాల

గురువారం । 28 । మార్చి । 2024

I



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని నిత్య కళావేదికపై కడప జిల్లాకు చెందిన ఎన్.రఘునాథ్ నృత్య కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్ మేడ్చల్‌కు చెందిన ఎం.వెంకటేష్, తిరుపతికి చెందిన నారాయణస్వామి దంపతులు రూ.1,01,116 చొప్పున విరాళమిచ్చారు.

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 4:51
ఆదోని	సా॥ 6:37	ఉ॥ 4:54
నంద్యాల	సా॥ 6:34	ఉ॥ 4:48
ఆత్మకూరు	సా॥ 6:32	ఉ॥ 4:49
బనగానపల్లె	సా॥ 6:35	ఉ॥ 4:49

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

మహమ్మద్ ప్రవక్త రసూలుల్లా పేరు పలికినా లేదా వినగానే 'సొల్లెల్లాహు అలైహి వసొల్లం' చదవాలని అల్లాహ్ ఆజ్ఞ. లేనిపక్షంలో వినాశనం అయ్యేంత శాపం ఉంది.

– పవిత్ర ఖురాన్

సీఎం వైఎస్ జగన్.. పేదల ప్రజల గుండె చప్పుడు.. ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పాఠశాలలను, ఆసుపత్రులను అద్భుతంగా తీర్చిదిద్దిన దార్శనికుడు..హామీలన్నీ అమలు చేసి పారదర్శక పాలన అందించిన జననేత.. నేడు (గురువారం) నందుల గడ్డకు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక డిగ్రీకళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. నంద్యాలను జిల్లాగా మార్చి చిరకాల స్వప్నాన్ని నిజం చేసిన రాయలసీమ ముద్దుబిడ్డను చూసేందుకు జనం భారీగా తరలిరానున్నారు.

సంక్షేమ దారుల్లో.. జననేత జైత్రయాత్ర



- బస్సు యాత్రలో భాగంగా నంద్యాలకు రానున్న సీఎం వైఎస్ జగన్
- నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ
- జిల్లా నలుమూలల నుంచి లక్షలాదిగా తరలి రానున్న ప్రజలు
- ఉదయం ఎర్రగుంట్ల గ్రామంలో వివిధ వర్గాల వారితో మాటామంతీ
- ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకోనున్న సీఎం

బస్సుయాత్ర సాగనుందిలా..

- సీఎం వైఎస్ జగన్ గురువారం ఉదయం 9.30 గంటలకు ఆళ్లగడ్డ నుంచి బయలుదేరనున్నారు.
- ఎర్రగుంట్ల గ్రామానికి చేరుకుని అక్కడ ప్రజలతో మమేకమవుతారు. ప్రభుత్వ పనితీరును, సంక్షేమ పథకాల అమలుపై వారితో మాట్లాడనున్నారు.
- అక్కడి నుంచి బయలుదేరి వెంకటాపురం, గోవిందపల్లె మీదుగా రైతునగరం క్రాస్‌కు చేరుకుంటారు.
- లంచ్ బ్రేక్ తర్వాత సాయంత్రం నూనెపల్లె, ఎస్పీజీ గ్రౌండ్స్ మీదుగా ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు చేరుకుంటారు.
- సభ ముగిసిన తర్వాత పాణ్యం, కాల్వబుగ్గ మందిరం, ఓర్వకల్లు, కర్నూలు క్రాస్, పెద్దటేకూరు, పెద్దకొట్టాల మీదుగా నాగలాపురం చేరుకుంటారు. రాత్రి అక్కడే సీఎం వైఎస్ జగన్ బస చేయనున్నారు.

సాక్షి, నంద్యాల: సార్వత్రిక ఎన్నికల సమరానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శంఖారావం పూరించారు. 58 నెలల్లో చేసిన మంచిని వివరించి మరోసారి ఎన్నికల్లో దీవించాలని ఓటర్లను కోరేందుకు ఇడుపులపాయ నుంచి బుధవారం బస్సు యాత్రను ప్రారంభించారు. రాత్రి ఆళ్లగడ్డ సమీపంలో బసచేశారు. అక్కడి నుంచి గురువారం ఉదయం బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. ప్రజలకు, కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేసుకుంటూ ఆయన ముందుకు కదులుతారు. తనను కలవడానికి వచ్చిన ప్రజలతో మమేకమవుతారు.

భారీగా తరలిరానున్న ప్రజలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ మొదటిసారి నంద్యాల జిల్లాకు రానున్నారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. ఐదేళ్ల కాలంలో ప్రజలకు చేసిన మంచిని వివరించనున్నారు. పేదల పక్షపాత ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఓటర్లను కోరనున్నారు. సీఎం పాల్గొననున్న సభకు జిల్లా నలుమూలలనుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరానున్నారు. దాదాపు లక్ష మందికి పైగా ప్రజలు సభకు తరలివస్తారని ఓ అంచనా. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

పూర్తయిన ఏర్పాట్లు

బహిరంగ సభకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం సిద్ధమైంది. ప్రజలు భారీగా తరలిరానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేశారు. సభా వేదిక వద్ద సీఎం జగన్‌మోహన్ రెడ్డితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు కూర్చునేలా సభా వేదికను ఏర్పాటు చేశారు. సభా వేదిక నుంచి ప్రజల మధ్యకు వచ్చేలా ర్యాంప్ ఏర్పాటు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేసి గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ప్రజలకు దాహం తీర్చేందుకు వాటర్ ప్యాకెట్లతో పాటు మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. సీఎం సభకు సుమారు 1,600 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే డైవర్షన్ పాయింట్లను ఏర్పాటు చేశారు. సీఎం ప్రయాణించే రూట్ మ్యాప్‌ను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికే పరిశీలించారు. ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

సభకు భారీగా తరలిరండి

మేమంతా సిద్ధం బహిరంగ సభా వేదికను బుధవారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పరిశీలించారు. సభా ప్రాంగణమంతా కలియతిరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా మొదటి సారి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొనే సభకు భారీగా ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం బహిరంగ సభను అందరూ విజయవంతం చేయాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

ఆళ్లగడ్డ: మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్ర దువ్వూరు మీదుగా బుధవారం రాత్రి 9.30 గంటలకు చాగలమర్రి టోల్‌గేట్‌కు చేరుకుంది. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర జల వనరుల సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, నంద్యాల జిల్లా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సీఎంకు పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సీఎం బస్సు టోల్ గేట్‌లోకి ప్రవేశించగానే ఒక్కసారిగా జై జగన్, మేమంతా సిద్ధం అంటూ నినాదాలు హోరెత్తాయి. కార్యకర్తల ఉత్సాహాన్ని చూసిన సీఎం బస్సులోనుంచి అందరికీ అభివాదం చేశారు. రాత్రి 9.50 గంటలకు ఆళ్లగడ్డ పట్టణ శివారులో సీఎం బస కోసం ఏర్పాటు చేసిన శిల్పా వెంచర్‌కు బస్సు చేరుకుంది. ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాబూలాల్, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వీరభద్రుడు, భూమా కిషోర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



అభిమానులకు బస్సులోనుంచి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పార్కింగ్ ఏర్పాట్లు ఇలా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్టణంలో పర్యటన సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జిల్లా పోలీసులు డైవర్షన్ పాయింట్లు ఏర్పాట్లు చేశారు.

- వెంకటేశ్వరపురం నుంచి వచ్చే వాహనాలను పట్టణంలోకి అనుమతించరు. వాటిని హైవే మీదుగా డైవర్షన్ చేశారు.
- వై.జంక్షన్(చామకాలువ) నుంచి ఫ్లై ఓవర్ మీదుగా బొమ్మలసత్రం, క్రాంతినగర్ ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు ఎస్పీజీ హైస్కూల్, రైల్వే స్టేషన్ మీదుగా డైవర్షన్ చేశారు.
- ఆళ్లగడ్డ నుంచి వచ్చే వాహనాలను బొమ్మలసత్రం వద్ద ఆపుతారు. ఎస్వీ రెడ్డి కళాశాల దాటిన తరువాత కుందూ రివర్ పక్కన ఉన్న పార్కింగ్ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేసుకోవచ్చు.
- పాణ్యం, బనగానపల్లె, డోన్, నందికొట్కూరు ప్రాంతాల నుంచి సభకు వచ్చే వాహనాలను పొగాకు కంపెనీ(ఐటీసీ సర్కిల్) వద్ద నిలిపేస్తారు. ప్రథమ నంది వద్ద ఉన్న ప్రదేశంలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.
- శ్రీశైలం, ఆత్మకూరు ప్రాంతాల నుంచి సభకు వచ్చే వాహనాలను వై జంక్షన్(చామకాలువ) వద్ద ఆపుతారు. వాహనాలు ఎస్పీజీ స్కూల్ గ్రౌండ్‌లో ఉన్న పార్కింగ్ ప్రదేశానికి వెళ్లాలి.
- జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సీఎం సభకు వచ్చే బైక్‌లు, కార్లు, ఆటోలు మొదలైన వాటిని హోలీ క్రాస్ స్కూల్ పార్కింగ్‌లో, ఆర్కే ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న పార్కింగ్ ప్రదేశంలో నిలుపుకోవచ్చు.

ప్రజలతో ముఖాముఖి

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో గురువారం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలతో ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏర్పాట్లను బుధవారం జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గంగుల సుదర్శన్‌రెడ్డి, గంగుల విజయ సింహారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘువరెడ్డి, సర్పంచ్ అయ్యలూరి సుభహాన్, ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మేరువ చిన్న నాగిరెడ్డి, పెద్ద లాల్, పురుషోత్తం, యాపరాల నడిపి గుర్రప్ప, శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గట్టి పోలీస్ బందోబస్తు

సీఎం కార్యక్రమాన్ని గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ చంద్రబాబు తెలిపారు. ముగ్గురు డీఎస్పీలు, సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు, 65 మంది పోలీస్ సిబ్బంది, 15 మంది బాంబు స్క్వాడ్‌తో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



సీఎం జగన్‌కు స్వాగతం పలికేందుకు కార్యకర్తలతో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



నంద్యాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి



బహిరంగ సభకు ముస్తాబైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం

న్యూస్‌రీల్

జొన్న కొనుగోలు కేంద్రాల పరిశీలన



జొన్న దిగుబడిని పరిశీలిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు

వెలుగోడు: మండలంలోని రేగడగూడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శేఖర్ బాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 19 మండలాల్లో జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 983 మంది రైతుల నుంచి 6,500 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రంలో జొన్న విక్రయించేందుకు ఈ నెల 30వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట నంద్యాల డీఎం మార్క్‌ఫెడ్ నాగరాజు, ఆత్మకూరు ఏడీ ఆంజనేయ, వెలుగోడు ఏఓ పవన్‌కుమార్ ఉన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ. 2.30 కోట్లు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామికి హుండీ ద్వారా రూ.2,30,26,480 ఆదాయం సమకూరింది. బుధవారం శ్రీమఠం రాజాంగణ భవనంలో మార్చి నెలకు సంబంధించి 29 రోజుల హుండీ కానుకలు లెక్కించారు. నగదు రూపేణా రూ.2,25,14,080, నాణేల రూపంలో రూ.5,12,400 వచ్చినట్లు మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. అలాగే 81 గ్రాముల బంగారం, 848 వెండి కానుకలు సమకూరినట్లు తెలిపారు.

వైభవంగా సుధీంద్రతీర్థుల ఆరాధన



సుధీంద్రతీర్థుల బృందావనానికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం ఆనెగుంది నవ బృందావన క్షేత్రంలో మధ్వమత పూర్వపు పీఠాధిపతి సుధీంద్రతీర్థుల ఆరాధన వేడుక వైభవంగా జరిగింది. బుధవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో కనుల పండువగా వేడుక చేపట్టారు. సుధీంద్రతీర్థుల మూల బృందావనానికి నిర్మాల్య విసర్జన, పుష్ప, పంచామృతాభిషేకాలు చేశారు. మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి హారతులు పట్టారు. అనంతరం నవబృందావన క్షేత్రంలో మూల, జయ, దిగ్విజయ రాముల సంస్థాన పూజలో స్వామిజీ తరించారు. వేడుకలకు హాజరైన భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

అనుమతులున్న రాజకీయ ప్రకటనలు తొలగించొద్దు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా

నంద్యాల: రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో శాశ్వత ప్రాతిపదికన అనుమతులున్న రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ప్రకటనల హోర్డింగులను తొలగించకుండా కొనసాగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు ముందస్తు చేస్తున్న ఏర్పాట్లను, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు తీరును సమీక్షించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

ఉగాది మహోత్సవాలకు ఏర్పాట్లు చేయండి

- ఈఓ డి.పెద్దిరాజు



మాట్లాడుతున్న శ్రీశైల దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న ఉగాది మహోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవస్థాన కార్యనిర్వహణధాకారి డి.పెద్దిరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది మహోత్సవాల్లో శ్రీస్వామిఅమ్మవార్లకు జరిగే ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరిపించాలన్నారు. కాలినడకన నల్లమల అడవుల గుండా వచ్చే భక్తులకు తాగునీటితో పాటు మౌలిక వసతులు కల్పించాలన్నారు. క్యూలైన్లలో, క్యూ కాంప్లెక్స్‌లో నిరంతరం తాగునీటిని సరఫరా చేయాలని, కూలర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్రపరిధిలో పలుచోట్ల షామియానాలు, చలువపందిర్లు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వైద్యశాల సహకారంతో అవసరమైన చోట్ల తాత్కాలిక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర పరిధిలో అన్ని చోట్ల కన్నడ భాషలో సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కన్నడ ప్రవచనాలు, కన్నడ భక్తి సంగీత విభావరి, భక్తి నాటకాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు.

ఆశాజనకంగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. సోమవారం సూపర్-10 సరకు రకం అమ్మకానికి వచ్చాయి. సూపర్-10 రకం జనరల్ క్వింటా గరిష్ఠ ధర రూ.14,500, మధ్యస్థ ధర రూ.12,500, కనిష్ఠ ధర రూ.10,000గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ఠ ధర క్వింటా రూ.5,800, మధ్యస్థ ధర రూ.5,500, కనిష్ఠ ధర రూ.5,000 పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

ముగిసిన 'పది' పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 18న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారం నాటితో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 1,699 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కాగా అన్ని సబ్జెక్ట్‌లకు కలిపి జిల్లాలోని 134 కేంద్రాల్లో 25,984 మంది విద్యార్థులకు గానూ 24,285 మంది హాజరయ్యారన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా నిర్వహించామన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ బకాయిలు విడుదల

నంద్యాల (సెంట్రల్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా మెటీరియల్ కాంపోనెంట్ పనుల కింద గ్రామ సచివాలయాలు రైతు భరోసా కేంద్రాల నిర్మాణం చేపట్టారు. వీటికి సంబంధించి రూ.1.25 కోట్ల బకాయిలు మంజూరయ్యాయి. నిర్మాణాలు పూర్తి చేసి బిల్లుల కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్ల ఖాతాల్లో ఈ మొత్తాన్ని జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఎదురుపాడు పొలిమేరలో ఎలుగుబంటి

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామ పొలిమేరలోకి బుధవారం ఎలుగుబంటి రావడంతో గొర్రెల కాపారులు భయాందోళనకు గురయ్యారు. కాపారులు తిమ్మరాజుకుంట చెరువు సమీపంలో గొర్రెలను మేపుతుండగా అటువైపుగా ఎలుగుబంటి రావడాన్ని గమనించి కేకలు వేయడంతో అక్కడి నుంచి నీటిమునక పొలాల్లోకి పరారయ్యిందని వారు తెలిపారు. ఇదే విషయమై ఫారెస్టు రేంజ్ అధికారి పట్టాభిని వివరణ కోరగా వారం రోజుల క్రితమైతే ఎలుగుబంటి వచ్చిందని, బుధవారం ఎలుగుబంటి ఆధారాలేవీ లేవన్నారు.

విషప్రభావంతో మహిళ మృతి



పద్మావతి మృతదేహం

నందికొట్కూరు: పట్టణంలోని వాల్మీకి నగర్‌కు చెందిన పద్మావతి(49) విషప్రభావానికి గురై మృతిచెందింది. హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపిన వివరాలు.. బుధవారం ఉదయం ఇంటి ముందు కల్లాపి జల్లే మందు డబ్బాను మూత తీస్తుండగా అందులో నుంచి వచ్చిన విష వాయువు పీల్చి స్పృహ తప్పి పడిపోయింది. చుట్టుపక్కల వారు గమనించి హుటాహుటిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పూర్తి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మహిళా జైలు తనిఖీ

కర్నూలు (లీగల్) : న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వెంకటనాగ శ్రీనివాసరావు బుధవారం కర్నూలు మహిళా జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఖైదీలతో మాట్లాడి కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు ఉచిత న్యాయ సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వంట గదులను పరిశీలించారు. జైలు అధికారులను అడిగి ఖైదీల వివరాలు తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది బద్దల లక్ష్మీనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాల్లో ప్రథమం

- ఏరియా ఆసుపత్రిలో రికార్డుస్థాయి కాన్పులు
- 6 సంవత్సరాలుగా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం



ప్రభుత్వాసుపత్రిలో బాలింతల వార్డు

ఎమ్మిగనూరురూరల్: ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'ఆదర్శ కాన్పుల వార్డు' అత్యుత్తమ ఫలితాలనిస్తోంది. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల ప్రజలతోపాటు సి.బెళగల్, ఆస్పరి, దేవనకొండ ప్రాంతాల్లోని మెజార్టీ గ్రామాల ప్రజలకు ఎమ్మిగనూరు వైద్యశాలలో విస్తృత వైద్యసేవలు అందుతున్నాయి. ప్రారంభంలో 30 పడకల ఆసుపత్రి 2002లో కమ్యూనిటీ ఆసుపత్రిగా నూతనంగా నిర్మించి పడకల సంఖ్య పెంచారు. నేడు రూ.12.60 కోట్లతో 100 పడకలకు అప్‌గ్రేడ్‌చేశారు. రూ.కోట్లతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఆసుపత్రి గత ఆరు సంవత్సరాలుగా ప్రసవాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలుస్తోంది.

రూ.2కోట్లతో 'ఆదర్శ'కాన్పుల వార్డు

యూనిసెఫ్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మిగనూరు వైద్యశాలలో ఆదర్శ కాన్పుల వార్డును ఏర్పాటు చేసింది. రూ.2 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో వార్డులో సౌకర్యాలు కల్పించారు. నలుగురు గైనకాలజిస్టులు, 25 మంది స్టాఫ్ నర్సులను నియమించారు. ఇక్కడ నెలకు 220 నుంచి 310కి పైగా కాన్పులు చేస్తున్నారు. ప్రతిరోజూ గర్భిణిలకు స్కానింగ్, రక్తపరీక్షలు, సాధారణ చెకప్‌లు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి వచ్చినా ఇక్కడ సేవలు అందుతున్నాయి.

గర్భవతులకు ఆర్థిక సాయం

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు చేయించుకునే వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. పీహెచ్‌సీలో 3 నెలల తరువాత పేరు నమోదు చేసుకుంటే 5వ నెలలో రూ. 2 వేలు, ఆసుపత్రిలో ప్రసవం జరిగితే రూ.1000, సంవత్సరన్నరలో అన్ని వ్యాక్సిన్స్ వేయించుకుంటే రూ. 2 వేలు నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారు. ఆరోగ్యశ్రీ ఆసరా కింద రూ. 4 వేలు, జననీ సురక్ష యోజన కింద రూ.1000 బాలింతకు ఇస్తున్నారు.

ఎమ్మిగనూరు ఆసుపత్రిలో ప్రసవాలు సంవత్సరాల వారీగా..

సంవత్సరం	నార్మల్ డెలివరీ	సీజేరియన్	మొత్తం
2019	2,123	318	2,441
2020	2,507	420	2,927
2021	2,612	592	3,204
2022	2,642	521	3,164
2023	571	114	685
2024	2,583	567	3,150

నెలనెలా వైద్య పరీక్షలు తప్పనిసరి



గర్భవతులు క్రమం తప్పకుండా నెల నెల వైద్య పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలి. ప్రస్తుతం ప్రైవేటు హాస్పిటల్స్‌కు దీటుగా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్నాయి. గర్భవతులు స్కానింగ్‌తో పాటు వైద్య పరీక్షలు చేయించుకొని, మంచి పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

– డాక్టర్ సుజిత, డిప్యూటీ సివిల్ సర్జన్

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం సురక్షితం



ఇంట్లో కాకుండా ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగితే తల్లీబిడ్డలకు మంచిది. ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకొని అందుకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రసవాల కోసం ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. గర్భవతులు ప్రభుత్వాసుపత్రిలోని వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఫాతిమా, అసిస్టెంట్ సివిల్ సర్జన్

ప్రసవాల సంఖ్య పెరుగుతోంది



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. నార్మల్ డెలివరీలతో పాటు అత్యవసరమైతే సిజేరియన్‌లు చేస్తున్నాం. ప్రతి నెలా స్కానింగ్ పరీక్షలకు గర్భవతులు వందల సంఖ్యలో వస్తున్నారు. నెలకు వందకు పైగా కుటుంబ నియంత్ర ఆపరేషన్లు కూడా చేస్తున్నాం. 100 పడకల ఆసుపత్రి పూర్తయితే మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంది. డాక్టర్ల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ మైత్రేయి, గైనకాలజిస్ట్, సూపరింటెండెంట్

సీఎం సభకు పటిష్ట భద్రత



ఎమ్మిగనూరు వైడబ్ల్యూసీఎస్ మైదానంలో భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



తుగ్గలి వద్ద సీఎం బస చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 29న ఎమ్మిగనూరు పట్టణం వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. సభా వేదిక వద్ద భద్రత ఏర్పాట్లపై డీఎస్పీ సీతారామయ్య, పోలీసు ఉన్నతాధికారులతో బుధవారం ఎస్పీ చర్చించారు. సభకు వచ్చే ప్రజల సంఖ్య తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ మధుసుదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

తుగ్గలి: మేమంతా సిద్ధం పేరుతో బస్సుయాత్ర చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29న రాత్రి తుగ్గలి మండలానికి చేరుకోనున్నారు. తుగ్గలి సమీపంలో బస రాత్రి బస చేయనున్నారు.ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగేష్, పులికొండ, మోహన్‌రెడ్డితో కలిసి బుధవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరిశీలించారు. తుగ్గలి సమీపంలో రాత్రి బస కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించి స్థానిక నాయకులతో చర్చించారు. అంతకు ముందు ఎస్పీ కృష్ణకాంత్, అడిషనల్ ఎస్పీ నాగరాజు, ఇంటిలిజెన్స్ అధికారులతో కలిసి సీఎం రాత్రి బస ఏర్పాట్లకు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. ఎస్పీ వెంట పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున ఉన్నారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు పార్లమెంటు నియోజకవర్గానికి పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం చేయాలంటే కచ్చితంగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన దరఖాస్తును సువిధ పోర్టల్‌లో 48 గంటల ముందు అప్లోడ్ చేయాల్సి ఉంది. అప్‌లోడ్ చేసిన 24 గంటల్లో అనుమతులు జారీ అవుతాయి. ఇందుకోసం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో సింగిల్ విండో పర్మిషన్, క్యాండిడేట్ లైజనింగ్ సెల్ ఏర్పాటైంది. ఈ సెల్‌కు నోడల్ అధికారిగా జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి వ్యవహరిస్తున్నారు. మాన్యువల్‌గా కూడా దరఖాస్తు స్వీకరిస్తున్నారు. దరఖాస్తులు ఇక్కడే లభిస్తాయి. సువిధ పోర్టల్‌లో దరఖాస్తు అప్‌లోడ్ చేసిన వెంటనే జిల్లా వ్యవసాయ అధికారి, నోడల్ అధికారి పీఎల్ వరలక్ష్మి.. లైన్ డిపార్టుమెంట్లకు పంపుతారు. లైన్ డిపార్టుమెంట్లలో పోలీసు, ఆర్అండ్‌బీ, డీపీవో, అగ్నిమాపక దళం, విద్యుత్, రవాణ శాఖ, పంచాయతీ రాజ్, మున్సిపాలిటీ శాఖలు ఉంటాయి. ఆయా శాఖల నుంచి 24 గంటల్లో సమాధానం రావాల్సి ఉంది. ఆ యా శాఖల నుంచి సమాధానాలు వచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజనకు ఫైల్ పంపుతారు. కలెక్టర్ ఆమోదం తెలిపిన వెంటనే అనుమతి ఉత్తర్వులను ఎన్‌కోర్ పోర్టల్ ద్వారా పంపుతారు. ఎన్‌కోర్ పోర్టల్ నుంచి అను మతి ఉత్తర్వులను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది.

అనుమతులు లేకుండా గ్రానైట్ కటింగ్

కర్నూలు (న్యూటౌన్): అనుమతులు లేకుండా ఆదోని పట్టణ శివారులో వీరభద్ర గ్రానైట్ కటింగ్ పాలిషింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నట్లు తనిఖీలో వెలుగు చూసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. ఈ యూనిట్‌ను నాగరాజు అనే వ్యక్తి నిర్వహిస్తున్నారని విచారణలో తేలిందన్నారు. యూనిట్‌లో ఉన్న రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేసి స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ ప్లాంట్ తనిఖీ

హాలహర్వి మండలం మిదేహాల్ గ్రామంలోని నీరజాక్షి ఐరన్ అండ్ స్టీల్ ప్లాంట్‌ను తనిఖీ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. ప్లాంట్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశామన్నారు. అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తరలిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, శివశంకర్, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక బలవన్మరణం



మృతిచెందిన అర్జునుడు

గోనెగండ్ల: అప్పుల బాధ తాళలేక వేముగోడు గ్రామానికి చెందిన బోయ దిద్దికాటి అర్జునుడు(43) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రామకృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. బోయ దిద్దికాటి అర్జునుడుకు భార్య పద్మావతి, కుమారుడు, కూతురు ఉన్నారు. గ్రామంలో రెండు ఎకరాల భూమి ఉంది. వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పొలం పెట్టుబడులు, కుటుంబ పోషణకు బ్యాంక్, తెలిసిన వారి దగ్గర రూ.5లక్షలు అప్పు చేశాడు. చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెంది మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇంటిపై కప్పుకు ఉన్న కడ్డీకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామన్నారు.

పచ్చ నేత.. మట్టి మేత



పోలీసుల అదుపులో ఉన్న ట్రాక్టర్లు, జేసీబీలు

అవినీతి అక్రమాలకు టీడీపీ నాయ కులను మించినోళ్లు లేరు. వారు అనుకుంటే మట్టిని సైతం ఇట్టే మేసేస్తారు. ఓర్వకల్లు వద్ద అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతూ మంగళవారం అడ్డంగా దొరికిపోయిన టీడీపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు, గుట్టపాడు గ్రామ సర్పంచు మోహన్‌రెడ్డే ఇందుకు నిదర్శ నం. అధికార పార్టీ నాయకులపై నిత్యం అవినీతి, అక్రమాల ఆరోపణలు చేసే ఈ ప్రబుద్ధుడు తన అక్రమాలను గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తుండటం ఆశ్చర్యకరం. ఓర్వకల్లు గ్రామ సమీపంలోని లింగం వారి చెరువులో మట్టిని తవ్వి, స్థానిక జైరాజ్ ఇస్పాత్ స్టీల్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నాడు. మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండానే చెరువు యజమానులతో లోపాయికారి ఒప్పందం చేసుకొని తవ్వకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నట్లు మైనింగ్ అధికారులకు ఇటీవల సమాచారం అందింది. వారి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు చెరువు వద్దకు వెళ్లి ట్రాక్టర్లు, జేసీబీలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అయితే మట్టి మేసిన పచ్చ నేతపై ఇటు పోలీసులు గానీ, మైనింగ్ అధికారులు గానీ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

– ఓర్వకల్లు




ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు



మోసగాళ్లను అరెస్టు చూపుతున్న సైబర్ అనాలసిస్ టాస్క్‌ఫోర్స్ టీమ్

కర్నూలు : ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు అవుతుందని నమ్మించి మోసానికి పాల్పడిన కర్నూలు మండలం మునగాలపాడు గ్రామానికి చెందిన నవీన్ కుమార్, అతని తమ్ముడు అరుణ్ కుమార్, బావమరిది మహేష్‌లను కర్నూలు సీఐడీ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. ఈ సందర్భంగా బుధవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కర్నూలు సీఐడీ రీజనల్ ఆఫీస్ సైబర్ క్రైం అనాలసిస్ టాస్క్‌ఫోర్ టీమ్ సీఐ ఎస్.నగేష్ బాబు వివరాలను వెల్లడించారు. కర్నూలుకు చెందిన జంగం వీరలక్ష్మిని స్నేహితురాలు మాధురి ద్వారా నవీన్ కుమార్ పరిచయం చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో ఎస్‌ఏ ట్రేడింగ్ కంపెనీలో మినిమమ్ అమౌంట్ ఇన్వెస్ట్ చేస్తే నెల రోజుల వరకు రోజూ కొంత మొత్తం ఆమె అకౌంట్‌కు జమ అవుతుందని మాయమాటలు చెప్పాడు. వీరలక్ష్మి సెల్‌ఫోన్‌కు లింక్ పంపి విడతల వారీగా రూ.4.87 లక్షలు పెట్టుబడి పెట్టించాడు. ఆన్‌లైన్‌లో డబ్బులు వేసిన తర్వాత లింక్‌కు సంబంధించిన సైట్ ఓపెన్ కాకపోవడంతో వరలక్ష్మి.. నవీన్ కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా త్వరలో ఓపెన్ అవుతుందని మాయమాటలు చెప్పి మోసం చేశాడు. ఆ తర్వాత అతని సెల్‌ఫోన్ కూడా పనిచేయకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైం అనాలసిస్ టాస్క్‌ఫోర్స్ టీమ్ రంగంలోకి దిగి కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసినట్లు నగేష్ బాబు తెలిపారు. జిల్లాలో సుమారు 143 ఆన్‌లైన్ ఫిర్యాదులలో వీరు నేరస్తులుగా ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. నవీన్ కుమార్ కర్నూలులో నివాసముంటూ ఆన్‌లైన్‌లో ఎస్‌ఏ ట్రేడింగ్ కంపెనీ గురించి వివరిస్తూ బెంగళూరులో కంపెనీ ఉందని, మేనేజింగ్ డైరెక్టర్‌గా రమణ నాగ్‌పాల్ ఉన్నారని నమ్మించేవారన్నారు. ఆన్‌లైన్‌లో జనరేట్ అయ్యే ఒక లింక్ ద్వారా అకౌంట్‌ను ఓపెన్ చేసుకుని అందులో పెట్టుబడి పెడితే నెల రోజుల తర్వాత నుంచి రోజుకు కొంత మొత్తం అకౌంట్‌కు జమ అవుతుందని మోసం చేశారన్నారు. అమాయక ప్రజలు చాలామంది అతని మాటలు నమ్మి పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోయినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. ఆన్‌లైన్ బిజినెస్, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ఆన్‌లైన్ లింక్ బిజినెస్ తదితర పేర్లతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇలా మోసపోతే తక్షణమే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి (టోల్‌ఫ్రీ) లేదా ఛిఛిఛి. ఛిఞ్చటఛిటజీఝ్ఛ. gov. in కు ఫిర్యాదు చేయాలని లేదా దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిందితులు ముగ్గురినీ కోర్టులో హాజరుపర్చగా వచ్చే నెల 8వ తేదీ వరకు న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ బందే సాహెబ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ప్రవీణ్, బోస్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



బెస్త సందీప్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: రోడ్డు ప్రమాదంలో పదమూడేళ్ల బాలుడు మృతి చెందాడు. మరో నలుగురు గాయపడ్డారు. ఈ దుర్ఘటన బనవాసి ఏపీ గురుకుల పాఠశాల సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు...ఆదోని పట్టణం కొడల్‌పేటకు చెందిన బోయ వెంకటేష్ కుమార్తెతో సి.బెళగల్‌కు చెందిన యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. యువకుడిని చూసేందుకు వెంకటేష్ బొలెరోలో సి. బెళగల్‌కు బంధువులతో బయలుదేరారు. అదే కాలనీకి చెందిన బెస్త లక్ష్మీనారాయణ కుమారుడు బెస్త సందీప్(13)ను కూడా తీసుకెళ్లారు. బెంగళూరు వాసులు శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకొని తిరిగి కారులో వెళ్తున్నారు. వేగంగా వస్తున్న బొలెరో వాహనం ముందుగా వెళ్తున్న దేవబెట్ట గ్రామానికి చెందిన గంగాధర్, నరసప్పల స్కూటర్ హ్యాండిల్‌కు తగిలింది. అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టింది. దీంతో బొలెరోలో ఉన్న బెస్త సందీప్ ఎగిరి కిందపటంతో తలకు బలమైన గాయమైంది. బొలెరోలో ఉన్న మరో బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఇదే ప్రమాదంలో కారులో ఉన్న బెంగళూరు వాసులు నాగరాజు, యాదగిరి, రెండు సంవత్సరాల బాలికకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడు బెస్త సందీప్ మార్గమధ్య మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



మేమంతా సిద్ధం!
శ్రీ పోచా బ్రహ్మానందరెడ్డి గారు
యం.పి., నంద్యాల
శ్రీ శిల్పా మోహన్ రెడ్డి గారు
మాజీ మంత్రివర్యులు
శ్రీ శిల్పా చక్రపాణి రెడ్డి గారు
ఎమ్మెల్యే, శ్రీశైలం.
ఇచ్చిన హామీలతో పాటుగా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారు ఇడుపులపాయ నుండి ప్రారంభించిన 21 రోజుల బస్సు యాత్ర.. మన నంద్యాల పట్టణాన్ని చేరుకుంటున్న శుభసందర్భంగా జన హృదయనేత జగనన్నకు స్వాగతం.. ఘన స్వాగతం..
శ్రీ వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గారు
ముఖ్యమంత్రివర్యులు
బహిరంగ సభ వేదిక :
GOVT డిగ్రీ కళాశాల మైదానం,
నంద్యాల.
తేది: 28-03-2024,
సమయం: మధ్యాహ్నం 3 గంటలకు
శ్రీ శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి
వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యే అభ్యర్థి,
నంద్యాల.
వైఎస్ఆర్‌సిపి నాయకులు,
కార్యకర్తలు, అభిమానులు నంద్యాల

క్లుప్తంగా

తనిఖీలు ముమ్మరం

- జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి



చాగలమర్రి చెక్ పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

చాగలమర్రి: జిల్లాలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. బుధవారం జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద ఉన్న పోలీసు చెక్‌పోస్టును తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నగదు, మద్యం భారీగా తరలే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పంపాలన్నారు. ఆధారాలు లేకుండా తరలించే డబ్బును సీజ్ చేయాలన్నారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జేవీ సంతోష్, ట్రైనీ డీఎస్పీ రఘువీర్, ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్, చాగలమర్రి ఎస్ఐ రమణయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన బాలచౌడయ్య

బనగానపల్లె రూరల్: మండలంలోని కైప - అప్పలాపురం గ్రామాల మధ్య బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలచౌడయ్య (55) దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. టంగుటూరు గ్రామానికి చెందిన బాలచౌడయ్య బంధువులతో కలిసి కోడలికి పసుపు కుంకుమ తీసుకొని ఆటోలో బనగానపల్లెకు వెళ్లాడు. అక్కడ పని పూర్తి అయిన తర్వాత సాయంత్రం స్వగ్రామం టంగుటూరుకు ఆటోలో బయల్దేరారు. కైప - అప్పలాపురం గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో బాలచౌడయ్య, ఆటో డ్రైవర్ గోవిందుకులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక బాలచౌడయ్య మృతి చెందాడు. డ్రైవర్ గోవిందును మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య సుబ్బమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు.

కాల్వల్లో చెత్త వేస్తే చర్యలు

నంద్యాల(సిటీ): పట్టణంలోని మురుగు కాల్వల్లో చెత్త వేయరాదని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పద్మావతినగర్ ప్రధాన రహదారిలోనున్న జ్యోతి వైన్స్ యాజమాన్యానికి బుధవారం మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రతి రోజూ దుకాణం నుంచి వెలువడుతున్న ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు, తినుబండారాల కవర్లను మురుగు కాల్వలో పడేయడంతో మురుగు ప్రవాహానికి అంతరాయం కలిగిందన్నారు. పట్టణంలోని అన్ని దుకాణాల యజమానులు తమ షాపుల నుంచి వెలువడే చెత్తను పురపాలక వాహనానికి అందించాలని కోరారు.

నీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలి



రుద్రవరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించిన ఎంపీడీఓ

రుద్రవరం: తాగునీటి సమస్యపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రామచంద్ర పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముందుగా తాగునీటి సమస్య, ఎన్నికల కోడ్ అంశాలపై జిల్లా అధికారులు జూమ్ మీటింగ్ ద్వారా సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీఓ వారితో మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా ఉన్నాయని నీటి సమస్య తలెత్తే అవకాశముందని, అందుకు అందరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చేతి పంపులు,బోర్లను మరమ్మతులు చేయించాలని, అక్కడికీ కుదరక పోతే కొత్త బోర్లకు ప్రతిపాదనలు పంపితే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనుమతులు వస్తే కొత్త బోర్లు వేయించవచ్చన్నారు. అలాగే ఎన్నికల కోడ్‌కు సంబంధించి వలంటీర్లకు ముందస్తు హెచ్చరికలు చేయాలన్నారు. పార్టీల కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, అలా కాదని తిరిగే వాళ్లు ఉంటే ముందే రాజీనామా చేయంచాలని చెప్పారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ తదితరులు ఉన్నారు.

నీటి ఎద్దడిపై ప్రతిపాదనలు పంపండి

చాగలమర్రి: మండలంలో నీటి ఎద్దడి ఉన్న గ్రామాల వివరాలు పంపాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ సుర్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతిపాదనలు పంపితే ఉన్నతాధికారులకు పంపి పనులకు అనుమతులు తీసుకుంటామని చెప్పారు. ఇన్‌చార్జ్ ఈఓ నాగమణి, కార్యదర్శులు దస్తగిరి, రాజేష్, స్వర్ణకుమార్, రాజశేఖర్, ఫైరోజా, సబియా పాల్గొన్నారు.

నాడు డీలా.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు సమస్యలతో కునారిల్లాయి. అరకొర సరుకుల కోసం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గర్భిణిలు, బాలింతలు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. కుళ్లిన గుడ్లు, మురిగిన పాలు, నాణ్యత లేని ఆహార పదార్థాలు ఇస్తుండటంతో చాలా మంది తీసుకునేందుకు ఆసక్తి చూపేవారు కాదు. చిన్నారులకు అసౌకర్యాల పాతాలే గతి అన్నట్లుగా ఉండేది.

నేడు భరోసా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో తల్లీబిడ్డకు పౌష్టికాహారంతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమని అందుకు అంగన్‌వాడీ కేంద్రాలే వేదికని రాష్ట్ర ప్రభుత్వం భావించి పకడ్బందీ చర్యలు చేపట్టింది. గర్భిణిలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇళ్ల వద్దకే పది రకాల సరుకులు సరఫరా చేస్తోంది. అంగన్‌వాడీలు కొత్త రూపు దాల్చాయి. సౌకర్యాలతో చిన్నారుల భవిష్యత్‌కు స్వాగతం పలుకుతున్నాయి.



బాలింతలకు పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

తల్లీబిడ్డకు 'పోషకాహారం'

- మాతా, శిశుమరణాల తగ్గింపే లక్ష్యం
- పకడ్బందీగా సంపూర్ణ పోషకాహారం పంపిణీ
- కిట్లులో పది రకాల సరుకులు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న మార్పులు
- ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ విధానం అమలు



చిన్నారులకు బొమ్మలను ప్రదర్శిస్తూ విద్య బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

కోవెలకుంట్ల: పూర్వప్రాథమిక విద్యనందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు సంపూర్ణ పోషక ఆహార నిలయాలుగా మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న మార్పులు చేసి తల్లీబిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి మాతా, శిశు మరణాల రేటును పూర్తి స్థాయిలో తగ్గించే దిశగా చర్యలు చేపట్టింది. నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు అన్ని హంగులు కల్పించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించింది. సొంత భవనాలు లేని కేంద్రాలకు అన్ని వసతులతో నూతన భవనాలు నిర్మించడంతోపాటు సరైన వసతులు లేని అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు చేపట్టి అన్ని సౌకర్యాలు కల్పించింది. కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్య నేర్పించడంతోపాటు మధ్యాహ్న భోజన వసతి, తల్లులకు పౌష్టికాహార కిట్లను అందిస్తూ తల్లి, బిడ్డ ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 1,663 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో 1.55 లక్షల మంది చిన్నారులు, 16,434 మంది బాలింతలు, 15,394 మంది గర్భిణీలు లబ్ధి పొందుతున్నారు. తల్లులలో రక్తహీనత సమస్య తలెత్తకుండా లబ్ధిదారులందరికీ టేక్‌హోం రేషన్ సేవల ద్వారా పౌష్టికాహారాన్ని పత్యేక సంచుల్లో ఇంటివద్దకే అందిస్తోంది. కేంద్రాల్లో 3-6 సంవత్సరాల్లోపు చిన్నారులకు సరికొత్త మెనూతో రుచికరమైన వంటకాలతో భోజనం వడ్డిస్తున్నారు. గర్భిణిలు, బాలింతలకు నెలకు సరిపడేలా మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరలీటర్ పామాయిల్, 2.5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, కిలో అటుకులు, 2 కిలోల రాగిపిండి, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశనగ చిక్కీలు, 250 గ్రాముల ఎండు ఖర్జూరం , 2.5 కిలోల బాలామృతం అందజేస్తున్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం రూ. 200 కోట్లకు పైగా వెచ్చించింది.

అంగన్‌వాడీల్లో వినూత్నమార్పులు..

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. దీనిలో భాగంగానే కిచెన్ గార్డెన్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పోషక విలువలతో కూడిన ఆకుకూరలు, కూరగాయ తోటలను అంగన్‌వాడీ కేంద్రాల ప్రాంగణంలోనే సాగు చేసేందుకు చర్యలు తీసుకుంది. సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాల నిర్వహణ, కేంద్రాలపై ప్రజలకు విశ్వసనీయతను పెంచేందుకు పోషణ పక్వాడ కార్యక్రమంతో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కిట్లను సరఫరా చేసింది. పీపీ-1, పీపీ-2 మెటీరియల్‌ను అందజేసి వాటి ప్రకారం చిన్నారులకు పాఠాలు బోధిస్తున్నారు. చిన్నారుల్లో శరీర దారుఢ్యం పెంచేందుకు ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను సైతం అందిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందకు ప్రీస్కూల్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నారు.

పారదర్శకతకు పెద్దపీట

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సంపూర్ణ పోషకాహార పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేసింది. ఇందుకోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పౌష్టికాహార సరఫరాకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

- ఇళ్లవద్ద లబ్ధిదారులు సరుకులు తీసుకున్నారో లేదో తెలిసేలా ఫోటోలు అప్‌లోడ్‌చేసేలా చర్యలు చేపట్టింది.
- చిన్నారులకందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే హాట్‌కుక్ యాప్‌లో వివరాలు నమోదవుతాయి.
- గ్రామ సచివాలయ మహిళా పోలీస్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తారు.
- సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్త, సూపర్‌వైజర్ నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేయాలి. లేని పక్షంలో వారిపై శాఖపరమైన చర్యలు తీసుకునేలా యాప్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నారు.
- లబ్ధిదారులకు అందించే గుడ్ల సరఫరాకు ప్రత్యేక యాప్ అందుబాటులో ఉంది. ఆయా కేంద్రాలకు గుడ్ల ఏజెన్సీలు సక్రమంగా సరఫరా చేస్తున్నాయా, సైజు, నెలవారీ కోటా, స్టాంపింగ్, గుడ్ల నాణ్యత, తదితర వివరాలు నమోదు చేస్తున్నారు.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం, చిన్నారుల్లో లోపపోషణ, ఎత్తు, బరువులు, పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి, తదితర వివరాలు పొందుపరుస్తున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక యాప్‌ల అమలుతో తల్లులకు నాణ్యమైన సరుకులు అందటమే కాకుండా పౌష్టికాహార పంపిణీలో అక్రమాలకు చెక్ పడింది.

రక్తహీనత సమస్య తగ్గుతోంది



గర్భిణిలు, బాలింతల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. తల్లులు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇళ్ల వద్దకే నెలకు సరిపడిన పది రకాల సరుకులు అందజేస్తున్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య తగ్గుతోంది.

– సువర్ణ, బాలింత, కోవెలకుంట్ల

సేవలు బాగున్నాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలపై నమ్మకం పెరిగింది. పిల్లలకు కేంద్రాల్లో ఆటపాటలతో విద్యబోధించడంతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. చిన్నారులు, గర్భిణిలు, బాలింతలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు.

– హేమలత, కోవెలకుంట్ల

అన్ని హంగులతో అంగన్‌వాడీ భవనాలు



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నిర్మించే అంగన్‌వాడీ కేంద్రాలను అన్ని వసతులతో నిర్మిస్తున్నారు. గతంలో సొంత భవనాలు లేక ఇరుకైన అద్దె భవనాల్లో కేంద్రాలు కొనసాగేవి. చిన్నారుల కష్టాలను గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సువిశాలమైన నూతన భవనాలు నిర్మిస్తోంది.

– లింగమయ్య, కోవెలకుంట్ల



నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం

రూ.13.34 కోట్లతో మహర్దశ..

జిల్లాలోని ఆయా మండలాల్లో నాడు- నేడు కార్యక్రమం ద్వారా 99 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ. 13.64 లక్షల నిధులు కేటాయించారు. ఈ నిధులతో చిన్నారులకు విద్య బోధించేందుకు సువిశాలమైన హాల్, కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారం నిల్వ చేసేందుకు న్యూట్రిషియన్ గది, మధ్యాహ్న భోజన పథక నిర్వహణకు వంటగది ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటితోపాటు చిన్నారులు, గర్భిణిలు, బాలింతలకు మౌలిక వసతులు కల్పించేందుకు అంగన్‌వాడీ కేంద్ర ఆవరణలో బాత్‌రూం, మరుగుదొడ్డి, తదితర వసతి కల్పించేలా భవన నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. కొత్త భవనాలతోపాటు ఆయా మండలాల పరిధిలోని మరో 99 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు రూ. 2.44 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులతో ఆయా కేంద్రాల్లో మరమ్మతు పనులు పూర్తి అయ్యాయి.

దాసుడిపై ప్రహ్లాదవరదుడి విహారం



మాడవీధుల్లో గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామి

- గోవింద నామస్మరణతో పులకించిన దిగువ అహోబిల క్షేత్రం

ఆళ్లగడ్డ: దాసుడిగా.. సఖుడిగా.. ఆసనంగా.. ఆవాసంగా.. వాహనంగా.. ధ్వజంగా.. పలు విధాలా మహావిష్ణువుకు నిత్య వాహనమైన గరుత్మంతుడిపై ప్రహ్లాదవరదుడు బుధవారం తెల్లవారు జాము వరకు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అహోబిలేశుడి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టం గరుడ వాహన సేవ మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు వైభవోపేతంగా నిర్వహించారు. భక్త జనసందోహంతో దిగువ అహోబిలం కిటకిటలాడింది. ఉదయం ఉత్సవమూర్తులను కోనేరు వద్దకు తోడ్కొని వెళ్లి తీర్థవారి చక్రస్నానం, సాయంత్రం ద్వాదశారాధనం, రాత్రి పుష్పయాగం నిర్వహించి అర్ధరాత్రి అనంతరం ప్రహ్లాదవరదుడు వజ్రవైడూర్యాలు, బంగారు ఆభరణాలు ధరించి గరుడవాహనం అధిష్టించి తిరువీధుల్లో ఊరేగుతూ భక్తుల నీరాజనాలు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వేడుకల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా తెప్పోత్సవం

భూదేవి, లక్ష్మీసమేతుడైన ప్రహ్లాదవరద స్వామి తెప్పోత్సవం బుధవారం రాత్రి దిగువ అహోబిలం క్షేత్రంలో కనులపండుగలా సాగింది. ఉత్సవమూర్తులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రహ్లాదవరద స్వాములను పల్లకీపై కొలువుంచి మాడ వీధుల్లో ఊరేగింపుగా కోనేటి వరకు తోడ్కొని వచ్చారు. ఉభయ దేవేరులతో స్వామి తెప్పను అధిరోహించిన అనంతరం అర్చకుల పూజలు అందుకుని తెప్పపై విహరించారు. వేదపండితులు, వేద విద్యార్థులు, పీఠాధిపతి శిష్యులు.. నారసింహ స్వామి కీర్తనలు భక్తి పారవశ్యంతో ఆలపిస్తుండగా, చల్లని వేళ భక్తుల నుంచి హారతులు అందుకుంటూ ప్రహ్లాద వరదస్వామి ఉభయ దేవేరులతో తెప్పపై ఊరేగారు. కోనేటి చుట్టు భక్తులు చేరుకుని కార్యక్రమాన్ని వీక్షించి ఆశీస్సులు అందుకున్నారు.



కోనేరులో పడవపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు

ముగిసిన బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలు ముగిసిన సందర్భంగా ధ్వజ పటాన్ని అవరోహణం చేస్తున్న అర్చకులు

దిగువ అహోబిల క్షేత్రంలో పదకొండు రోజుల పాటు సాగిన వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణంతో ముగిశాయి. అహోబిలం 46 పీఠాధిపతి శ్రీమాన్ శఠకోప యతీంద్ర మహాదేశికన్ పర్యవేక్షణలో ముద్రకర్త కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయన్‌ల, జీపీఏ సంపత్, ఓఎస్‌డీ శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారు జామున ధ్వజావరోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి వారి సమక్షంలో బ్రహ్మాది దేవతలకు అష్టదిక్పాలురకు వీడ్కోలు చెబుతూ గరుడ కేతనాన్ని ధ్వజ స్తంభంపై నుంచి కిందకు దించారు. ఈ సందర్భంగా గరుడధ్యానం, భేరీపూజ, భేరితాడనం, గరుడగద్యం, దిక్పాలక గద్యం, గరుడ లగ్నాష్టకం, గరుడ చూర్ణిక అనే ఏడు వేదోక్త మంత్ర పఠనములను వేద పండితులు జపించి బ్రహ్మోత్సవాలను పరిసమాప్తం చేశారు.

ఎండలతో జాగ్రత్త

నంద్యాలటౌన్: రోజురోజుకు వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎండ తీవ్రత, వడగాల్పుల సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు..

- ఎండలో బయటకు వెళ్తే తలపై రుమాలు లేదా టోపీ, గొడుగు రక్షణగా వినియోగించాలి. కాటన్ వస్త్రాలు ధరించాలి.
- కళ్లకు రక్షణ ఇచ్చే యూవీ ప్రొటెక్షన్ కళ్లద్దాలను డాక్టర్ల సలహాలతో ఉపయోగించాలి. ఎండ సమయంలో వీలైనంతవరకు ఇంట్లో ఉండటానికి ప్రయత్నించండి.
- దాహం వేయకపోయినా తరచుగా నీటిని తాగండి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోస్, ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగాలి.
- వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రానిచో, దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి అవసరమైన చికిత్స చేయించాలి.
- ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు గానీ నిమ్మకాయ రసం, కొబ్బరినీరు తాగాలి.
- తీవ్రమైన ఎండలో బయటకు వచ్చినప్పుడు తల తిరుగుట, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించాలి.
- ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోవాలి. చల్లని నీటితో స్నానం చేయాలి.

చేయకూడనివి..

- నలుపు రంగు, మందంగా ఉండే దుస్తులు ధరించరాదు.
- మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 3 గంటల మధ్య కాలంలో బయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు.
- బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగరాదు.
- శరీరాన్ని డిహైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బోనేటెడ్ శీతల పానీయాలు తీసుకోరాదు
- అధిక వెలుతురునిచ్చే బల్బులు వాడరాదు. వాటి నుంచి అధిక వేడిని విడుదలవుతుంది.

వ్యక్తిగత ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

నంద్యాల టౌన్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ, పరిసరాల శుభ్రతను విధిగా పాటించాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో బోదకాలు వ్యాధితో బాధ పడుతున్న వారికి జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు ఆధ్వర్యంలో మార్బిటీడీ కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా దోమ కాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బోదకాలు వ్యాధితో బాధపడుతున్న వారు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 123 మంది బోదకాలు వ్యాధిగ్రస్తులకు ఆయా సబ్ యూనిట్ పరిధిలో మార్బిటీడీ కిట్లు పంపిణీ చేశామన్నారు. వరప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలన్నింటికీ అనుమతులు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా ఎస్వీఆర్, ఆర్జీఎం ఇంజినీరింగ్ కాలేజీలను గుర్తించామని రాజకీయ పార్టీల అభిప్రాయాలు సేకరించి ఆమోదం కోసం ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. ఇప్పటి వరకు 40 మంది రెగ్యులర్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. రాజకీయ ప్రచారంలో పాల్గొన్న 12 మంది వలంటీర్లను తొలగించామన్నారు. సి విజిల్ ద్వారా 81 ఫిర్యాదులు అందగా 22 వాస్తమని తేల్చి తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ప్రచారానికి సంబంధించి సువిధ సర్వీసు ద్వారా 152 దరఖాస్తులు వచ్చాయని అందులో 132 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పద్మజ, వైఎస్సార్‌సీపీ తరపున అనిల్‌అమృతరాజు, సాయిరాంరెడ్డి, కాంగ్రెస్ తరపున సయ్యద్ రియాజ్ బాషా, టీడీపీ తరపున శివరాంరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బీజేపీ తరపున చంద్రశేఖర్, సీపీఐ(ఎం) తరపున పూల నరసింహులు, ఆమ్‌ఆద్మీ తరపున వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

వైఎస్సార్‌సీపీలో చేరిక



శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులు

నంద్యాల(అర్బన్): పట్టణానికి చెందిన నబీరసూల్, కలాంబాషా, మహబూబ్ బాషా, గ్రానైట్ మాలి, ఇర్షాద్ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీలు బిస్మిల్లా ప్లేవుడ్ టింబర్ డిపో సుభాన్ కుటుంబ సభ్యులు మౌలానా, నిజాముద్దీన్ కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా సమక్షంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. శిల్పా మోహన్‌రెడ్డి, శిల్పా రవి మాట్లాడుతూ జగనన్న పాలనలో మైనారిటీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదన్నారు. ముస్లింల ద్రోహి అంటూ నాడు బీజేపీ విధానాలను వ్యతిరేకించిన చంద్రబాబు నాయుడు నేడు అదే పార్టీతో పొత్తు పెట్టుకోవడాన్ని మైనారిటీలు గమనిస్తున్నారన్నారు. రెండవసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుని రాష్ట్రాభివృద్ధికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో సద్దాం, కలాం, నిజాముద్దీన్, అబ్దుల్ రహిమాన్, సాదిక్, వలి, ఇమ్రాన్, మదర్సా ఉన్నారు. అలాగే..పట్టణంలోని 28వ వార్డులోని గూడ్స్‌షెడ్డు, ఇస్లాంపేటకు చెందిన యువకులు బుధవారం రాత్రి టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, వైఎస్సార్‌సీపీ పట్టణ క్లస్టర్ అధ్యక్షుడు జాకీర్‌హుసేన్, పార్టీలో చేరారు. వీరికి మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో హుసేన్, జైపాల్, అబ్బాస్, సుభాన్, కరీం, ఖాదర్, ఇమ్రాన్, రఫీ ఉన్నారు.



పార్టీలో చేరిన ముస్లింలతో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్